కథ

# పనిలో పని

**-కాకాని కమల**

రైలుకి టైము అయిపోతూంది. హడావుడిగా పెట్టేబేడా సర్దుకుంటూనే సుభద్ర భర్తతో అంది-

'యావండి. నేను ఊళ్ళోలేని ఈ పది రోజులూ జాగ్రత్తగా వుండండి. ఓ గుప్పెడు బియ్యం వుడకేసుకుని ఓ కూర చేసుకోండి. పెరుగు, పచ్చడి ఎటూ వుంటాయి. హాయిగా కడుపు నిండుతుంది. అనవసరంగా హోటలు కూడు తిని ఆరోగ్యం పాడుచేసుకోకండి. పైగా బోల్డంత డబ్బు వృధా. మీకు వంట శ్రమలేకుండా అన్ని రకాల పొడులు, చేతి పచ్చళ్ళు నూరి పెట్టాను చూసుకోండి. అల్మారాలో సీసాల నిండా ఉన్నాయి'' అంది.

''సరే'' అన్నాడు సుందర్రావ్.

పేరుకి తగినట్టు సుందర్రావు నిజంగానే చక్కగా ఉంటాడు. ''మగవాడు ఎలా వుంటే బాగుంటుంది?'' అంటే జవాబుగా సుందర్రావుని చూపిస్తే చాలు. సుభద్ర మంచి గృహిణి. ఎంత వెకిలి మొగవాడికైనా సుభద్రని చూడగానే చెయ్యెత్తి నమస్కారం చెయ్యాలనిపిస్తూంది. అంత సంస్కారంగా ఉంటుంది. పైగా మంచి పొదుపరి. పని మనిషి కూడా లేకుండా ఇంటి పన్లు, బజారు పన్లు అన్నీ తనే స్వయంగా చేసుకుంటుంది. ఇంటి ఖర్చుకని భర్త ఇచ్చిన డబ్బులో అంతో ఇంతో వెనకేసుకుని ఇంటికి కావల్సిన నాలుగు సామాన్లు అమర్చుకుంటుంది.

''ఏవండోయ్ వింటున్నారా. ఇదిగో ఈ ప్లాస్టిక్ డబ్బాలో అప్పడాలు, వడియాలు ఉన్నాయ్. రాత్రిళ్ళు వేయించుకోండి' అంది.

''అలాగే'' అన్నాడు భార్య పమిటకొంగు సవరిస్తూ.

''మా నానమ్మ పరిస్థితి బాగుంటే తొందరగానే వచ్చేస్తాను. పదిహేను రోజుల కంటే ఎక్కువ వుండను'' అంది.

సుందర్రావ్ భార్య నడుం చుట్టు చేతులు బిగించి విరహంగా అన్నాడు.

''సరే గాని మీ నానమ్మకి ఒళ్ళు బాగోకపోతే నువ్వు అన్ని రోజులు వుండాలా?'' దిగులుగా చూశాడు.

''తప్పదండి. మా నానమ్మకి మేం అంటే తగని ప్రేమ. అన్నట్టు చెప్పడం మరిచాను. మీరు వంట చేసుకోండి. అంట్లు కడుక్కోనక్కర్లేదు. నేను వచ్చేదాకా పని మనిషిని మాట్లాడాను. అది రెండు పూటలా వచ్చి అంట్ల గిన్నెలు తోముతుంది. పాచి ఊడుస్తుంది. అది ఎన్ని రోజులు చేస్తే అన్ని రోజులు జీతం లెక్కకట్టి ఇస్తాను. పాతకోక కూడా ఆశపెట్టాను లెండి. నాగాలు పెట్టకుండా వస్తుంది. హాయిగా దానిచేత మీకు కావలసిన పన్లు అన్నీ చేయించుకోండి. మీరా చిల్లిగవ్వ కూడా ఇవ్వక్కర్లేదు. సామాన్లు ఎత్తుకుపోకుండా జాగ్రత్తగా చూసుకోండి చాలు.''

''సరే'' అనబోయి నాలిక్కరచుకుని, 'సరేగాని



అనవసరంగా పనిపిల్ల ఎందుకు డబ్బు దండగ. వీధి తలుపులు, కిటికీలు అన్ని వేసేసి బాత్‌రూమ్‌లో అంట్లు కూడా నేనే కడుక్కుందును కదా సుబ్బా'' అన్నాడు భార్యని బులిపించటానికి ఒంగి ఆమె జడ లోని పూలు ఘుమఘుమ వాసన చూస్తూ.

సుభద్ర కసురుకొన్నట్టు అంది - 'ఛీ. మగవాళ్ళు అంట్లు తోమటం ఎమిటి? అసలు మీరు వంట చేసుకోవలసి వచ్చింది కదాని నాకు బాధగా వుంటే'' అంది భర్త ఛాతిని ఆపేక్షగా నిమురుతూ. నిజంగానే సు భద్ర మొగుడ్ని బంగారంలా చూసుకొంటుంది. ''అప్పు డప్పుడు ఫోన్లు చేస్తూ వుం టాను లెండి'' అంది.

''సరే'' అన్నాడు.

''బామ్మకి జరగకూడ నిది ఏదన్న జరిగితే నేను రావటం ఇంకో పది రోజులు ఆలస్యం అవుతూంది'' రైలు కదిలే చివరి ఘడియ దాకా భర్తకి ఏవేవో జాగ్రత్తలు చెపుతూనే ఉంది.

❀❀❀

సుభద్ర పుట్టింటికి వెళ్ళి వారం రోజులు దాటుతూంది. సుందర్రావు ఇంట్లోనే వండుకుతింటున్నాడు.

పనిపిల్ల బాగానే పని చేస్తుంది.

భార్య పని మనిషిని వంట గదిలోకి రానివ్వద్దంది. కాని పనిపిల్ల సుందర్రావు చేతకాని వంట పని చూసి కిలకిల నవ్వింది.

'వుండండి అయ్యగోరు. నేను సేస్తాను'' అంటూ అదే వంట గదిలోకి చొరవగా వచ్చేసి వంట చేసింది. సుందర్రావు 'గంట' లో చేసే పని అది 'ఘడియ' లో చేసింది. హాయిగా వుంది సుందర్రావుకి.

❀❀❀

ఆ రోజు ఆఫీసు పనితో చాలా బిజీగా ఉన్నాడు సుందర్రావు. ఫోను వచ్చిందని రిసెప్షనిస్టు పిలిస్తే సీట్లోంచి లేచి వెళ్ళి ఫోను అందుకున్నాడు సుందర్రావు.

అవతల్నుంచి భార్య మాట్లాడుతూంది.

''మా బామ్మకి జబ్బు కాస్త తగ్గుముఖం పట్టిందండి. అయినా మా అందర్నీ ఇంకో పది రోజులుండమని గోల చేస్తుందండి.''

''ఎప్పుడొస్తావ్?''

''గట్టిగా చెప్పలేనండి. మీరు వంట చేసుకుంటున్నారు కదా?''

''ఆ...''

''పని మనిషి బాగా పని చేస్తుందా?''

''ఆ... చాలా బాగా పని చేస్తుంది'' అన్నాడు. తెల్లని మల్లెపూల లాంటి పక్కమీద నల్లని నాగినిలా హొయలు చిందే పని పిల్లని జ్ఞాపకం చేసుకుంటూ.

''దానికి తెలియకపోతే దగ్గరుండి చెప్పి చేయించుకోండి. పనంతా మీరే చేసుకొని ఆ ముండకి అలుసు ఇవ్వకండి. జీతంకాక పాతకోక అది ఇస్తానన్నాను. శుభ్రంగా మీకు కావలసినట్టు సౌకర్యంగా అన్ని పన్లు దానిచేత చెప్పి చేయించుకోండి'' అంది భర్త ఎక్కడ కష్టపడిపోతాడో అన్నట్టు తాపత్రయంగా.

''సరే...'' అన్నాడు.

''సరే సరే అనటం కాదు. అదేవన్నా ఊరికే చేస్తుందా! డబ్బిస్తున్నాం. మీకు ఏ పని కావాలంటే ఆ పని దగ్గరుండి చేయించుకోండి. మీకా మొహమాటం ఎక్కువ. వాళ్ళు చెపితే గాని చెయ్యరు. అందుకని మరీ ఇంతగా చెప్తున్నాను. అది ఇళ్ళూడుస్తున్నప్పుడు కూడా వుండండి లేకపోతే వస్తువులు పోతాయి.''

'సరే...''

''పన్లు అన్ని దాని చేతే చేయించుకోండి. లేకపోతే పని మనిషిని తేరగా మేపినట్టు అవుతుంది.''

''సరే... అన్ని పన్లు చెప్పి మరీ చేయించుకుంటాను. నాకు కావలసినట్టు చేయించుకుంటాను సరేనా?''

''అలాగని దాన్ని వంట గదిలోకి రానిస్తున్నారా?''

''అబ్బే లేదు. ఒక్క పడగ్గదిలోకే రానిస్తు..'' అనబోయి నాలిక్కరచుకుని ''నువ్వు వంటగదిలోకి రానివ్వద్దన్నావుగా, రానివ్వటం లేదు'' అన్నాడు.

''పొద్దున్న సాయంత్రం వస్తుందా? లేక ఎగ్గొడుతుందా ఓ పూట''.

''లేదు. పొద్దున, రాత్రీ వస్తూంది...'' అనబోయి మళ్ళీ నాలుక సంభాళించుకుని ''రెండు పూట్లా వస్తుంది'' అన్నాడు.

సుభద్ర యాభై ఏళ్ళ పని మనిషి పోశమ్మని పనిలో పెట్టిపోయింది. కాని పోశమ్మ రెండు రోజులు వచ్చింది. మూడవ రోజు నుంచి పోశమ్మ రావటం మానేసి పందొమ్మిదేళ్ళ కూతుర్ని పనిలోకి పంపటం మొదలెట్టింది.

''మీ అమ్మ రాలేదా?'' అన్నాడు సుందర్రావు గుమ్మంలో నిల్చున్న పిల్లని చూస్తూ.

''లేదు. మాయమ్మకి సుస్తు అయ్యింది. నన్ను పంపింది.''

''నీ పేరేమిటి?''

''నల్లమ్మ''

''అదేం పేరు?''

''నేను శానా నల్లగున్నాను కదా! అందుకని మా ఇంట్ల అంతా నన్ను నల్లమ్మ అంటారు'' అంది నల్లమ్మ తెల్లని పళ్ళు కనిపించేలా నవ్వుతూ.

''సరి'' అనుకున్నాడు. కేవలం నల్లమ్మ అని కాక 'నల్ల దుంగ ముక్కమ్మ' అని అంటే ఇంకా పేరు అతికి పోయినట్టుండేది అనుకున్నాడు.

చామనఛాయలో వున్న పోశమ్మ కంటే పందొమ్మిదేళ్ళ నల్లమ్మ పన్లు బాగా చేస్తుంది అనుకున్నాడు. బొంగరంలా ఇల్లంతా తిరుగుతుంది. గలగల నవ్వుతుంది. సుందర్రావుని సరదాగా ముట్టుకుని పరాచికాలు ఆడుతుంది. వాకిలి వూడవటానికి బకెట్ నిండా నీళ్ళు పడుతూ మధ్య వురిషిడితో నీళ్ళు తీసి సుందర్రావు మీద జల్లుతుంది. చల్లి ఊరుకుం టుందా? ''ఎట్టుంది సాని?'' అంటూ పకపకా నవ్వు తుంది. ''అయ్య గోరూ! అమ్మగోరు వచ్చింది'' అంది. సుందర్రావు గభాల్న తలతిప్పాడు. గల గల నవ్వుతూ ''అమ్మగోరంటే తవరికి భయ్యమా అయ్యగోరూ'' అంది. ''ఛ..' అన్నాడు. ''మీ అమ్మగారు చాలా మంచిది'' అని కూడా అన్నాడు. ''అట్టయితే తవరు


**రూ.2,50,000 విలువైన బహుమతులు గెలుపొందండి**

| | | |
|---|---|---|
| 5 | | |
| | 6 | |
| | | 7 |

| | | |
|---|---|---|
| 4 | 9 | 2 |
| 3 | 5 | 7 |
| 8 | 1 | 6 |

ప్రత్యేక బహుమతి:

హీరో హోండా మోటార్ సైకిళ్ళు లేదా చేతక్ స్కూటర్ లేదా కలర్ టి.వి.

కన్సోలేషన్ బహుమతులు:


పరస్పర లాభం పథకం క్రింద

కెమెరా, టూ-ఇన్-వన్ ట్రాన్సిస్టర్, శారీస్, చేతి గడియారాలు.

ఉదాహరణలో చూపినట్లుగా కాంపిటీషన్ పోస్ట్‌కార్డ్/ ఎన్వలప్/ ఇన్‌లాండ్ లెటర్ మీద 9 చదరాలు గీయండి మరియు 2 నుండి 10 వరకు గల అంకెలనుపయోగిస్తూ, అడ్డంగా, నిలువుగా మరియు ఏటవాలుగా ఎటుకూడినా మొత్తం 18 వచ్చేట్లు చూడండి. ఒక అంకె ఒకేసారి ఉపయోగించాలి. మీ ఎంట్రీలను ఆర్డినరీ మెయిల్ ద్వారా 10 రోజుల్లోగా పంపించండి. మొదట స్వీకరించిన 10 ఎంట్రీలకు టైటాన్ వాచ్ గోల్డెన్ చెయిన్ బహూకరించబడును.

**HERO ENTERPRISES (A-13)**

**VASUNDHARA, DELHI -110096**




నన్ను ఇట్ట బిగియార కౌగిలించుకుంటే కూడా అమ్మ గోరు తవర్ని ఏవనదా అయ్యగారూ'' అంది అదే నవ్వుతూ. ''నీ కొంటెతనం పాడుగాను'' కౌగిలి బిగి సడలిస్తూ.

''అయ్యగారు ఇహ నుంచి మా అమ్మ పనిలోకి రాదు. రోజూ నేనే వత్త'' అంది నల్లమ్మ.

''సంతోషం'' అన్నాడు.

పనిలోకి వచ్చిన మర్నాడే 'అయ్యా నాకేవన్నా ఇయ్యి' అంది నల్లమ్మ సుందర్రావు ముఖం మీదికి చెయ్యి జాపుతూ.

''జీతం అడ్వాన్స్ మీ అమ్మగారూ కాణీ ఇవ్వద్దంది. అసలు మీకు జీతం ఎంత మాట్లాడింది కూడా నాకు తెలవదు'' అన్నాడు.

''జీతంగాదు అయ్యా. వేరేగా నాకేదన్నా ఇయ్యి. మా యమ్మ నన్ను పనిలోకి అంపుతుంది గాని నెల జీతం అంతా మా యమ్మనే తీసుకుంటుంది. నువ్వు ఏవన్నా ఇత్తే నేను సినిమా చూత్తాను. గప్‌చుప్‌లు తింటాను. నువ్వేవన్నా ఇయ్యి'' అంది చెయ్యి సుందర్రావు ముఖం దగ్గరికి చాపుతూ.

జేబులోంచి ఇరవై రూపాయల నోటు తీసి ఇచ్చాడు.

''అద్సరే నల్లమ్మా తెల్లగా తెల్లారాక వస్తున్నావు నేను తొమ్మిందింటికే ఆఫీసుకు వెళ్ళాలి. తెల్లారకట్ట నాలుగింటికి రాగలవా?'' అన్నాడు.

''ఓ. మూడింటికి రమ్మన్నా రాగల్ను''.

''సాయంత్రం కూడా నేను ఆరింటికి రాలేను రాత్రి ఎనిమిదింటికి రాగలవా..''

''ఓ! పదింటికి రమ్మన్నా వత్త.''

''మీ అమ్మ ఏం అనదా?'' అనుమానంగా చూశాడు.

''ఉహూ... అసలు రేత్రికి ఇంటికెళ్ళకున్నా ఏం అడగదు. కట్టపడి పనిచేసి డబ్బు సంపాదించుకోండ్రి, మిమ్మల్ని నేను ఒక్క రెక్కన పోసించలేను, మీ అయ్య నన్ను నట్టేట ముంచినాడు అని ఏడుత్తుంది.''

''అదేమిటి?'' సుందర్రావు కళ్ళు ముడిచాడు.

''మా నాయన మమ్మల్ని సూడడు. ఏరే దాంతో ఏడనో దూరంగా వుంటాడు. మేం ఆరుగురం అక్కసెల్లెండ్రం. మా అమ్మ మా అందర్నీ పనిలోకి అంపుతుంది'' అంది.

''అలాగా!'' అన్నాడు హుషారుగా. అతని గొంతులోంచి ఈలలు తన్నుకొని రావటం మొదలెట్టాయి.

''సరే అయితే రేపట్నించి సాయంత్రం పనికి రాత్రి ఎనిమిది తరువాత రా. ఉదయం పనికి తెల్లారకట్ల నాలిగింటికిరా'' అన్నాడు.

''భేషుగ్గా వత్త. కాని మరి నాకేవన్నా ఇయ్యాలి'' అంది చెయ్యి చాపుతూ.

మళ్ళీ ఇరవై రూపాయలు ఇచ్చాడు. సంబరం పట్టలేక కౌగిలించుకున్నంత పని చేసింది.''

''ఇప్పుడు కాదు ఇప్పుడు కాదు'' అన్నాడు.

మర్నాటి నుంచి సుందర్రావు చెప్పిన టైముకి వస్తుంది, సుందర్రావు చెప్పిన ''పని'' చేస్తుంది.

''పని'' చక్కగా చేస్తుంది. సిగ్గు పడదు. ఒళ్ళు దాచుకోదు. నోరు తెరిచి ఏది అడగక్కర్లేదు. పందొమ్మిదేళ్ళకే నల్లమ్మకి ''అన్నీ'' తెలుసు.

❀❀❀

''హలో... హలో... ఏంటండి మాట్లాడరు. నేను చెప్పింది అసలు వింటున్నారా? హలో... ఇది ఎస్. టి. డి అండీ'' అవతల్నుంచి గయ్యిమంది సుభద్ర.

మధురానుభూతుల కొత్త రుచుల ఆస్వాదన నుండి వులిక్కిపడ్డాడు సుందర్రావు.

''పని మనిషి పని బాగా చేస్తుంది.''

''అబ్బే. ఆ విషయం కాదండి నేనడిగేది. దానికి జీతం మీరు ఇవ్వకండి. నేను వచ్చాక ఇస్తాను. అలాగే మాట్లాడాను లెండి. మీకు కావల్సిన పనులు మాత్రం సుబ్బరంగా మొగమాటం లేకుండా చేయించుకోండి. దాన్ని మేపకండి. అదేవన్నా డబ్బులు అడిగినా ఇవ్వకండి.''

''సరే'' అన్నాడు.

''వీలైతే వచ్చే వారంలో వస్తాను. వచ్చే ముందూ ఫోను చేస్తాను లెండి. ఇంక వుంటానండి శ్రీవారూ.''

''సరే'' అంటూ ఫోను పెట్టేశాడు. తన సీట్లోకి వచ్చి కూర్చున్నాడు. ఇందాక సగం రాసిన స్టేట్‌మెంట్ తీసి తిరిగి రాయటం మొదలుపెట్టాడు.

అతని చెయ్యి అలవాటుగా రాసుకుపోతూంది.

కాని సుందర్రావు చెవుల్లో భార్య గొంతు గంటలా మ్రోగుతుంది.

పని పిల్ల చేత ''బాగా పని'' చేయించుకోండి. దగ్గరుండి అన్ని పనులు చెప్పి చేయించుకోండి.

మొహమాటానికి పోయి దాని పని కూడా మీరే చెయ్యకండి. మీ పని దాని పని కూడా దానిచేత చేయించుకోండి...

అయ్యగోరూ నేను పని బాగా చేత్తున్నానా?'' కిలకిలా నవ్వు, చల్లని నీళ్ళ చిలకరింత. లేతతడి అరచేతులు తన చెక్కిళ్ళ మీద గిలిగింతలు పెడుతున్నట్టయి వులిక్కిపడ్డాడు.

నల్లని నాజూకు పూలతీగ, పెద్ద చెట్టు మానుని అల్లుకొంటున్నట్టు, నల్లని పందొమ్మిదేళ్ళ నల్లమ్మ కొండ చిలువలా తనని కౌగలించుకోవటం జ్ఞాపకం వచ్చింది. చెట్ల కొమ్మలనుంచి పూలు రాలుతున్నట్టు ఒళ్ళంతా పులకరిస్తుంటే ''రాత్రి ఎనిమిది ఎప్పుడు అవుతుందో'' అనుకుంటూ చేతులు పైకెత్తి బడలికగా ఒళ్ళు విరుచుకున్నాడు సుందర్రావు.

ఇది వరకూ ఆఫీసు పని ముగించి ఇంటికి వెడితే బోల్డంత విశ్రాంతిగా వుండేది. కాని ఇప్పుడా నల్లమ్మ రావటం మొదలయ్యాక ఇంటికెళ్ళాక కూడా పనే పని. ఒకే పని! పాడు పని?

''కష్టపడి పని చెయ్యాలోయ్. మీలాంటి వయసులో వున్నవాళ్ళు పనెక్కువంటే ఎలా? కష్టపడి పని చేస్తేనే ఒళ్ళు తేలిగ్గా వుంటుంది. ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లు కూడా చెపుతున్నారు కదా?'' సెక్షన్ మేనేజర్ స్టాఫ్ ఎవర్నో మందలిస్తున్నాడు.

సుందర్రావు చిరునవ్వుతో తిరిగి కాగితాలు అందుకున్నాడు.